ఇందిరా పార్కు వద్ద ఉద్రిక్తత


హోంగార్డుల భార్యలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ముగ్గురు మహిళలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలింపు

కవాడిగూడ: హోంగార్డుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద హోంగార్డుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టాలని పిలుపునిచ్చారు. అయితే ధర్నా చౌక్ వద్ద ఎలాంటి ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించరాదని నగర పోలీస్ కమిషన్ సీవీ ఆనంద్ ఉత్తర్వుల జారీ చేయడంతో హోంగార్డుల ధర్నాకు అనుమతి లభించలేదు. ఈ విషయం తెలియని భూపాలపల్లి జిల్లాకు చెందిన ముగ్గురు హోంగార్డుల భార్యలు ఇందిరా పార్కు వద్దకు ధర్నా జరుగుతుందని వచ్చారు. అక్కడ అనుమతి లేకపోవడంతో ఇందిరాపార్కు వద్ద బందోబస్తులో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ధర్నాచౌక్‌లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా హోంగార్డుల ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హోంగార్డులు వాస్తారేమో అని పోలీసులు భారీ బందోబస్తూ ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు


పూజలో పాల్గొన్న భక్తులు



ప్రారంభమైన కార్తీక మాస పూజలు

నల్లకుంట: కార్తీక మాసం ప్రారంభం కావడంతో శనివారం అంబర్‌పేట నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివుడు, శ్రీ మహావిష్ణుకు అత్యంత ప్రీతికరమైన మాసం కావడం భక్తులు పెద్ద ఎత్తున శివాలయాలకు చేరుకుని అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవాలయం ప్రాంగణంలోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో ఉదయం అర్చక స్వామి జ్ఞానేశ్వర్ మంత్రోచ్చారణల నడుమ శివుడికి మహాన్యాస పూజలు, ఏక రుద్రాభిషేకం, నెలవారి దీపం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం,ఏక రుద్రాభిషేకాలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్ రావు, ధర్మకర్తలు ఎస్.వెంకటేశ్వర రావు, ఎ.మధుకుమార్,వై.మురళీ,మధుసూధన్, మురళీకృష్ణ, ఆర్.ఓంప్రకాష్, మంజుల పాల్గొన్నారు.

రేపు క్షీరాభిషేకం..

మహోత్సవాల్లో మొదటి సోమవారం(4వ తేదిన) ఉదయం మహా శివుడికి క్షీరాభిషేకం ఉంటుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు తెలిపారు. శంకరమఠంలో చంద్రమౌళీశ్వర స్వామికి, లింగాలగడ్డ శివాలయం, న్యూనల్లకుంటలోని బీరప్ప దేవాలయం, తిలక్‌నగర్‌లో శివాలయంలో శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భవానీ శంకర దేవాలయంలో..

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ దోవుని తోటలోని భవానీ శంకర దేవాలయంలో శనివారం కార్తీక మాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఈవో జ్యోతి మాట్లాడుతూ నెలరోజులపాటు ఆలయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ రకాల పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ సిబ్బంది సురేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో....

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ఎంతో ప్రసిద్ధి చెందిన లక్ష్మీగణపతి, వివేక్‌నగర్‌లోని స్వయంభూగా వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీక మాస పూజలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. శనివారం ఉదయం 6గంటలకు ఏకవార రుద్రాభిషేకం,9గంటలకు మహన్యాస రుద్రాభిషేకం, సాయంత్రం 6గంటలకు ఆకాశదీప పూజ, కార్తీక పురాణ ప్రవచనం, రాత్రి 7గంటలకు భక్తులచే దీపారాధన, రాత్రి7.30 ప్రదోషపూజ, బిల్వార్చన, నివేదన, హారతి, మహా మంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. డిసెంబర్ 1వ తేదీ వరకు పవిత్ర కార్తీకమాస మహోత్సవములు ఉంటాయని ఆలయాల ఈవోలు పి.లక్ష్మారెడ్డి, ఎం.దేవనాధంలు తెలిపారు.

నేడు కరాటే పోటీలు


గోపాల్ రెడ్డి

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 3వ ఆదివారం ఉదయం 9 గంటలకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం కాచిగూడలోని కరాటే అకాడమీలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యి మంది పాల్గొంటారన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మహేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కృష్ణగౌడ్

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ పార్టీ కార్యకర్తలు, నేతలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్ నేతృత్వంలో పలువురు నాయకులు శనివారం మహేష్‌కుమార్‌ను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి


గంగపుత్ర కాలనీలో రోడ్డుపై పొంగుతున్న మురుగునీరు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో వారం రోజులుగా డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపై ఏరులైపారుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పూసగోరక్‌నాథ్ ఆరోపించారు. శనివారం స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు గంగపుత్ర కాలనీని సందర్శించి జలమండలి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్డుపై మురుగునీరు ప్రవహించడం వల్ల తీవ్ర దుర్గంధం, దోమలబెడద పెరిగిందని తెలిపారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి సైతం తీసుకువెళామన్నారు.

మెస్‌చార్జీల పెంపుదల శుభపరిణామం

బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్ గౌడ్


మిఠాయిలను తినిపిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో పెరిగిన ధరల ప్రకారం గురుకుల హాస్టల్ విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచడం శుభపరిణామమని అందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్ గౌడ్ తెలిపారు. శనివారం నగరంలో మెస్‌చార్జీల పెంపును హర్షిస్తూ మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ మెస్‌చార్జీలు పెంచాలని గత ఎనిమిదేళ్లుగా చేసిన పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. గత ప్రభుత్వాలు మెస్‌చార్జీలు పెంచకపోవడం వల్ల చాలీచాలని ఆహారంతో విద్యార్థులు పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందకపోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని 40శాతం మెస్‌చార్జీలు పెంచడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, బీసీ విద్యార్థి సంఘం కార్యదర్శి జాజుల లింగన్న, నీలకంఠేశ్వర్‌రావు, ఇంద్రం రజక అర్జున్ సుమన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో వ్యవసాయం చేర్చాలి



మాట్లాడుతున్న పిల్లి శ్రీనివాసరావు

కాచిగూడ: కులగణనలో మున్నూరుకాపుల సాంప్రదాయ కులవృత్తి వ్యవసాయం అంశం లేకపోవడం బాధాకరమని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం కాచిగూడలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 25వ కాలంలో మున్నూరుకాపుల వృత్తి వ్యవసాయం అనే అంశాన్ని చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన పత్రంలో మున్నూరుకాపులు 6వ కాలంలో బీసీ–డీ అని, 7,8 కాలంలో కేవలం మున్నూరు కాపు అని మాత్రమే రాయాలని కోరారు. కొందరూ మున్నూరుకాపు, రెడ్డి, పటేల్, కాపు, రావు అని ఇలా రాస్తుండటంతో మున్నూరుకాపుల జనాభాను తక్కువ చేసి చూపించాల్సి వస్తోందని, భవిష్యత్‌లో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దండు నరేందర్, బాదే పద్మరావు, చేపూరి వెంకటేశ్వర్‌రావు, కటకం మహేష్, ఉగ్గే శ్రీనివాస్, కోట శంకర్, చామకూర సుజాత, గుంటి మంజుల, అన్నం శాంతి ప్రియ పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


గిరి యాదయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్య మిత్రలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఆరోగ్యశ్రీ, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరియాదయ్య కోరారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలను డాటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్ ఇచ్చి వెంటనే అమలుచేయాలని ఆయన కోరారు. తాము సమ్మె విరమించి 45 రోజులు పూర్తి అయినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. మంత్రి ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య మిత్రలు తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. వెంటనే మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

ఫైప్‌లైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎ.పావని

చిక్కడపల్లి: ఫైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ కోరారు. కృపారావు లేన్ నుంచి గౌతమి స్కూల్ వరకు నిర్మిస్తున్న డ్రైనేజీ ఫైప్‌లైన్ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫైప్‌లైన్ ఏర్పాటులో చేసిన తవ్వకాలను సరిగా పూడ్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, సంపత్‌యాదవ్, డీజీఎం కార్తిక్ రెడ్డి, మేనేజర్ శ్రీధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'హరియాణా ప్రభుత్వాన్ని చూసి సీఎం రేవంత్ నేర్చుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్ నరేష్‌మాదిగ

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మాదిగలకు ద్రోహం చేసినట్లే అని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై హరియాణా ప్రభుత్వాన్ని చూసి సీఎం రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని హితవు పలికారు. శనివారం ముషీరాబాద్‌లోని భారత్ సేవా సమాజ్ కమ్యూనిటీహాల్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగల ధర్మయుద్ధ సన్నాహక సదస్సుకు ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జీ గజ్జల రాజశేఖర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నరేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీని విస్మరించారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ సాధనకై ఈ నెల 6వ తేదీన నగరంలోని ఖైరతాబాద్‌లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్‌లో మాదిగల ధర్మయుద్ధం మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గజ్జల వినయ్‌కుమార్, కోకన్వీనర్ సాయికుమార్, నాయకులు నాగరాజు, గోపి, ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నర్సింహ్మారావు, జాతీయ నాయకులు గండి కృష్ణమాదిగ, మల్లికార్జున్, నాయకులు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కవితా సంపుటిపై చర్చాగోష్ఠి

చిక్కడపల్లి: ప్రసిద్ధ కవి డాక్టర్ ఎం.కె.రాము రచించిన మధురోహలు కవితా సంపుటిపై ఈ నెల 4వ తేదీన చర్చాగోష్ఠి ఉంటుందని ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వాహకులు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ ఏల్లూరి శివరెడ్డి పాల్గొంటుండగా, సాహితీవేత్త డాక్టర్ టి.గౌరీశంకర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత కమిషనర్ నరసింహప్ప సంపుటిని సమీక్ష చేస్తారని వివరించారు. తొలుత కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

కాచిగూడ: బైక్ ఢీకొని మహిళకు గాయాలైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్‌ఐ సుభాష్ వివరాల ప్రకారం..నల్లకుంట ప్రాంతానికి చెందిన కవిత (40) నారాయణగూడ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో క్రౌన్ కేఫ్ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. నడుముకి గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప వివరాల ప్రకారం.. గుర్తుతెలియని ఓ వ్యక్తి (45) బుద్వేల్–ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి

కాచిగూడ: రైలు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఉప్పుగూడకు చెందిన పార్థీవత్ లక్ష్మణ్ (40) కూలి పని చేస్తుంటాడు. గత నెల 21న హంద్రినివా ఎక్స్‌ప్రెస్ ఎక్కి ఉప్పుగూడలో దిగుతుండగా కిందపడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మహిళ మెడలోని గొలుసు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని గొలుసు చోరీకి గురైంది. మల్కాజిగిరికి చెందిన లక్ష్మీ (48) గద్వాల నుంచి సికింద్రాబాద్ రావడానికి తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తుంది. శుక్రవారం రాత్రి సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి రైలెక్కి లక్ష్మీ మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడు గొలుసు లాక్కొని పారిపోయాడు.

వేముల రామకృష్ణకు సత్కారం

కాచిగూడ: బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విద్యార్థి ఉద్యమనేత వేముల రామకృష్ణ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అందిస్తున్న సేవలను గుర్తించి నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో ఘనంగా సత్కరించి అభినందించారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

లిబర్టీ: ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పార్టీని విస్తరింపచేస్తామని ఆయన వెల్లడించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే జాతీయ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి పోరాట ప్రణాళికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతెన్నులను ప్రజా సమస్యలపై సాగించాల్సిన పోరాట కార్యాచరణను ఖరారు చేస్తామని తెలిపారు.

పిల్లల్లో నైపుణ్యతను పెంపొందించాలి

• రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.వీ రమణాచారి • 22,23వ తేదీలలో పిల్లల జాతర కార్యక్రమం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కె.వీ రమణాచారి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం : పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి తెలంగాణ బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, తెలంగాణ బాలోత్సవం పిల్లల జాతర ఆహ్వాన సంఘం చైర్మన్ డాక్టర్ కె.వీ.రమణాచారి అన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23వ తేదీలలో నిర్వహించే నాల్గో పిల్లల జాతర కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.వీ.రమణాచారి మాట్లాడుతూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి బాలోత్సవం ఎంతగానో కృషిచేస్తుందని అన్నారు. పిల్లల ఆలోచనలను చిన్ననాటి నుంచే సామాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు. వివిధ అంశాలపై పిల్లలకు పోటీలు అభినందనీయమన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని నేర్పించడం మంచి పరిణామమన్నారు. నేను..నాదేశం అనే భావన పిల్లల్లో కలగాలన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల జాతర ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, భారత్ విద్యా సంస్థల చైర్మన్ సీ.హెచ్ వేణుగోపాల్ రెడ్డి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు కోశాధికారి బుచ్చిరెడ్డి, కె.సుజావతి, ఎస్.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం

కార్పొరేటర్ రచనశ్రీ


విద్యార్థులతో కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ: నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయం అని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. శనివారం దోమలగూడ గగన్ మహల్‌లో ఉన్న భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఉన్నత పాఠశాలలో సర్వ్‌నీడి స్వచ్ఛంద సంస్థ, అప్సా స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మూడు కంప్యూటర్లను ఉచితంగా పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జి. రచనశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థినీ విద్యార్థులకు కంప్యూటర్‌పై నైపుణ్యత పెంచుకోవాలనే ఉద్దేశంతో సర్వ్‌నీడి స్వచ్ఛంద సంస్థ కంప్యూటర్లు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కంప్యూటర్ విద్యలో నైపుణ్యత సాధించి పోటీ ప్రపంచంలో దూసుకుపోవాలన్నారు. సర్వ్‌నీడి స్వచ్ఛంద సంస్థతోపాటు అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పేదలకు చేయూతనివ్వాలని పేదలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వ్‌నీడి వ్యవస్థాపకుడు డాక్టర్ గౌతం, అప్సా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బొట్టు రమేష్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కూల్ సెక్రెటరీ సీజే అర్జున్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, అప్సా ప్రతినిధులు శ్రావణి, లావణ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

మూసీ బాధితులకు అండగా నిలవాలి

లిబర్టీ: మూసీ బాధితుల సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని అధికార, ప్రతిపక్ష నేతలకు ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్సీ ఎం. కోదండరాం, బీఆర్‌ఎస్ నాయకులు బి.వినోద్‌కుమార్, టీడీపీ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ, ఎంఐఎం నేతలను కలిసి మూసీ బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి నవంబర్ 4న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అఖిల పక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో తమ సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టును అన్ని కోణాల నుంచి పునపరిశీలించి, అఖిల పక్ష సూచనలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక, బాధితులకు పునరావాసం కల్పించడం వంటి డిమాండ్‌లపై ఈ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

షిర్డీసాయి విశ్వ సమాజ్ వ్యవస్థాపకులు మైనంపాటి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

పంజగుట్ట: ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్న సాయిబాబా మీద కొంతమంది పనికట్టుకుని అబద్ధపు ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని షిర్డీసాయి విశ్వ సమాజ్ వ్యవస్థాపకులు మైనంపాటి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా ఎవరు, ఆయనది ఏ మతం, షిర్డీలో వచ్చే ఆదాయంపై విష ప్రచారం జరుగుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయిబాబా పూర్ణ పరబ్రహ్మ, పరమాత్మ స్వరూపుడని శాస్త్రపరంగా నిరూపించబడిందని అన్నారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్మ సహజంగా అందరితో కలిసి ఎలా జీవించాడో సాయిబాబా కూడా అలానే జీవించారని తెలిపారు. సాయిబాబా దత్తావతారమని ఎంతో మంది మహాత్ములు, చెప్పడమే కాకుండా ఆయనను భగవత్ స్వరూపునిగా కొలిచారని గుర్తుచేశారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాని నరేంద్ర మోదీ కూడా సాయిబాబాను దర్శించుకున్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. మద్రాస్ హైకోర్టు దేవాలయాల నుంచి సాయిబాబా విగ్రహాలు తొలగించాలని ఆదేశించిందని ప్రచారం జరుగుతుందని అందులో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. అలాగే సాయి ట్రస్ట్ నుంచి వచ్చే డబ్బులు ఒక మతం వారు తీసుకుంటారని ప్రచారం జరుగుతుందని అందులోనూ వాస్తవం లేదని ట్రస్ట్ కలెక్టర్ ఆధీనంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తుందన్నారు. ఇకపై ఎవరైనా సాయిబాబా గూర్చి తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడమని అన్నారు. ఈ సమావేశంలో రుద్ర నాగేష్, ఎమ్. జ్యోతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట: సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌లోని వాంబే కాలనీలో గత కొంత కాలంగా డ్రైనేజీ సమస్య తలెత్తడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు శనివారం ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు.

కార్పొరేటర్ పాదయాత్ర


అచ్చయ్యనగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న రవిచారి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్ అచ్చయ్యనగర్‌లో ఆ డివిజన్ కార్పొరేటర్ రవిచారి పాదయాత్ర నిర్వహించారు. అచ్చయ్యనగర్ కాలనీ వాసులు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా ఆయన శనివారం ఆయా బస్తీలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మంచినీటి సమస్య, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని వర్క్స్ మేనేజర్‌ను కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేణు, సతీష్, మల్లేష్, రామకృష్ణ, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

5న బీసీల మేధో మదన సదస్సు

కాచిగూడ: బీసీ ఉద్యమాన్ని మరింత పటిష్టంగా, నిర్మాణాత్మకంగా ఉధృతం చేయడానికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈనెల 5వ తేదీన మంగళవారం కాచిగూడలో బీసీల మేధో మదన సదస్సును నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, పీ. సుధాకర్‌ల నేతృత్వంలో శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సులో బీసీ మేధావులు, లెక్చరర్లు, యువకులు, విద్యార్థులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతమున్న 12 బీసీ కుల ఫెడరేషన్లను బీసీ కార్పొరేషన్లుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోని రూ.5వేల కోట్ల ఫీజుబకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఇంజినీరింగ్, ఇంటర్, పీజీ, డిగ్రీ, ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. అలాగే బీసీ ఆత్మగౌరవ భవనాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.